# 1. సాహిత్యంలో బురద

సాహితీపరుల మైనందుకు మనం గంజి పెట్టి ఇస్త్రీ చేసిన కాలరెత్తుకుని మరీ సగర్వంగా గర్వపడాలి. మన దెప్పుడూ ముందడుగే. మనం పురోగమన దిశగా శరవేగంతో దుంటుతున్నా మనే బోడి నిజాన్ని నిరూపించేందుకు కిలోల కొద్దీ ఉదాహరణ లున్నాయి.

"మిల్టనాది కవులు పల్టీలు కొట్టగా" కవితా పల్టీలు కొట్టిన మహా మహా కవు లెందరో మన కున్నారు. ఇప్పటికీ వీళ్లంతా మనం పుట్టకముందు తాము త్రాగిన, త్రాగించిన కవితానేతిని గురించి ఉపన్యసిస్తూనే ఉంటారు.

నిత్య నూతనత్వం కోసం సదా కొట్టుకు చచ్చేవాళ్లం మనం. ఈ విషయంలో మీ కేమన్నా అనుమానా లుంటే మరో రెండు మూడు లీటర్ల ఉదాహరణ లివ్వగలను.

అన్నింటా ముందడుగు మనదే. ప్రకృతితో సైతం పోటీపడి పరుగెత్తుతాం. ఈ మధ్య మన రాజధానిలో ప్రకృతికి కాస్త ఉత్సాహ మెక్కువై సరదాగా పౌరుల ప్రాణాల్తో చెలగాట మాడింది గదా! ఆ మూసీ వరదలో కొందరు "నరకము మేలి భాగ్యనగరము కంటెన్" అని కొట్టుకు పోవడంతో, "కల దిల స్వర్గము మూసీ కద్దరి" అని కొట్టుకు

పోకుండా మిగిలిన వారిలో కొందరి కో అర్జంటు అయిడియా వచ్చి "నగరంలో వరద" అని ఓ కవి సమ్మేళనాన్ని మైకు, దండలు, పుష్పగుచ్ఛాలు ఇత్యాదుల్తో సహా ఏర్పాటు చేశారు.

పూర్వజన్మలో కవితా సరస్వతి కాటుక కంటి నీరు చనుకట్టు మీదుగా జారి వరదగా, బురదగా ప్రవహిస్తున్నా చూస్తూ కూర్చున్నందుకు శిక్షగా భోజులూ, రాజరాజనరేంద్రులూ సోదిలోక్కూడా కనపడని ఈ అకాడమీల బురద యుగంలో జన్మించామని నిద్రలో కూడా వాపోయే కవి సింహాలూ, కవిపులులూ, కవిఏనుగులూ చాలా మంది తుప్పు పట్టిన తమ కలం పాళీలను నూరుకుని సిరా ఎరువు తెచ్చుకుని అర్జంటుగా వరదల్ని కీర్తిస్తూ పంచరత్నాలు రాసుకొచ్చి చదివారట.

ఈ కవి శార్దూల, కవి మత్తేభాదులు గొంతు చించుకుంటూ, జుట్టు పీక్కుంటూ తమ కవితా పంచరత్న వరదతో మైకుల్ని గడగడ లాడించినా, శ్రోతలు మాత్రం ఒక్కరు కూడా ఒంటరిగా పారిపోలేదంటే అది మన కవితా వరదకే గర్వకారణం కదా !

ఆ కవితా కోకాకోలాను పీకలదాకా సేవించినా నిషా తలకెక్కని ఓ అమాయకు డడిగాడు. "తాత్కాలిక సమస్యల మీదగానీ, ఏదో ఓ ప్రత్యేక విషయం (విషంగాదు) నూరి పోసేందుకు గానీ సాహిత్యాన్నుపయోగించటం కళా

విలువలకే ద్రోహమనీ, నూరుగోవుల, వెయ్యి పిల్లుల హత్యతో సమానమనీ పెద్దలు మిరియాల చారు త్రాగి మరీ రేడియోల్లో కూడా ఘోషిస్తుంటారు గదా; మరి ఈ వరదకవులిలా బజార్న పడ్డారేంటి సార్ :'' అని.

కానీ, వాడుత్త అమాయకుడు. వినేవాడుండాలే గానీ అగ్గిపుల్లా, చెక్కబల్లా, వానా - వరదా - బురదా ఇవేవీ కవిత కనర్హం గావని అతగాడికి తెలియదు. అందులోనూ బురద అంటే మన కవిసింహాలకూ, కవిపులులకూ, కవి గోవులకూ మహా ఇష్టం.

ఇందులో కూడా మనవాళ్లకు కొంత పరోపకార బురదబుద్ధి ఉండటం హర్షణీయమే. ఈ విషయంలో మాత్రం వాళ్లంతా నిస్వార్థులే. ఉన్న బురదంతా తామే అనుభవించాలనే దురాశాపరులుగారు. తమ వంటినా బుర్రనా ఉన్న బురదలో కొంతన్నా తోటి కవులకు ఉచితంగానే బలవంతంగానైనా సరే దానం చేసే ఉదారులూ, ఉత్సాహులూ వారు.

మీకు నమ్మకం లేకుంటే మరో రెండు మీటర్ల ఉదాహరణ లివ్వగలను.

ఈ మధ్య జాషువా కవిగారికి "కళాప్రపూర్ణ'' బిరుదిచ్చింది ఆంధ్రా యూనివర్శిటీ. అందుకని "అజ్ఞాన బురదలో మునిగి మీ గొప్ప నింతవరకూ గుర్తించలేక పోయాం, కవిగారూ'' అని ఓ సంస్థవారాయనకు గజారోహణ, గండపెండేర, తులాభార రహిత సన్మానం ఏర్పాటు చేశారు.

ఆ సభకు పాత కళాప్రపూర్ణులు విశ్వనాథవారు విచ్చేసి తమ ఉపన్యాస వరదతో శ్రోతల్ని అలరించి, తర్వాత అలవాటు ప్రకారం "ఈయనగారికి కళాప్రపూర్ణ బిరుదిచ్చి గుర్రాన్నీ, గాడిదనీ ఒకే గాటన కట్టేశారు మన యూనివర్సిటీ వారు" అని ఓ బురద జోకు విసిరారట.

విశ్వనాథవారు ఎన్నో ఏనుగులెక్కిన కవిసామ్రాట్టులు. సాంప్రదాయ బద్ధంగా గంటంతోనే నవలలు రాస్తున్న శ్రోత్రియులు. కనుక 'నా అంతటి వాడా వీడు?'అని వారహంకరించటం కవితా బురద న్యాయం కూడా.

కానీ, జాషువాగారు కూడా కవే గదా! వారివద్ద మాత్రం బురద స్టాకు ఉండదా! కనుక శ్రీవారు తత్క్షణం విశ్వనాథవారు విసరిన బురదను మీద పడకముందే పట్టుకుని దానికి స్వంత బురద మరింత కలిపి విశ్వనాథవారి మీదకే విసిరేశారు.

"అవును స్వామీ! గుర్రాన్నీ - గాడిదనీ ఒకే గాట కట్టేశారు. ఏం చేస్తారు మరి గుర్రం ఆలస్యంగా దొరికింది వాళ్లకి" అన్నారట గుర్రం జాషువాగారు.

ఆ క్షణాన మన కవితా బురద పెద్దల, పిన్నల మొహాలెలా ఉన్నాయో చూడటానికి నేనక్కడ లేను మరి.

(ఫిబ్రవరి 1971)